దీపక్ స్వామికి జ్యోతిష్య శిరోమణి అవార్డు



అవార్డు అందుకుంటున్న మఠం దీపక్ స్వామి

కోటగిరి, మార్చి 10 : మండలంలోని ఎత్తొండ గ్రామానికి చెందిన మఠం దీపక్ స్వామి జ్యోతిష్య శిరోమణి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ప్రొఫెసర్ చేతుల మీదుగా దీపక్ స్వామి ఆదివారం అవార్డును అందుకున్నారు. మఠం దీపక్ స్వామిని మండల ప్రజలు అభినందించారు.

'రుబాయి రాగాలు' పుస్తకావిష్కరణ

సుభాష్‌నగర్, మార్చి 10 : ప్రముఖ కవి కాసర్ల నరేశ్ రచించిన కవితా పుష్పాల సంపుటి 'రుబాయి రాగాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నగరంలోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ప్రముఖ కవులు వీపీ చందన్‌రావు, దారం గంగాధర్, కేవీ రమణాచారి, డాక్టర్ త్రివేణి తదితరులు హాజరై మాట్లాడారు. ప్రకృతి, మట్టి, హృదయస్పందన, రుతుమార్పులను కాసర్ల తనదైన శైలిలో అక్షరాభిషేకం చేశారని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులను సన్మానించారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాయిబాబు, భాషాభిమానులు పాల్గొన్నారు.

నేడు నడ్పల్లిలో తైబజార్ వేలం

డిచ్‌పల్లి, మార్చి 10 : మండలంలోని నడ్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నేడు (సోమవారం) ఉదయం 10.30 గంటలకు తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి నిట్టు కిషన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. 50 వేలు ముందుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రేపు ధర్పల్లి సంత వేలం

ధర్పల్లి, మార్చి 10 : మండలకేంద్రంలోని ధర్పల్లి సంత వేలాన్ని ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీడీవో బాలకృష్ణ, కార్యదర్శి సైపుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో రోజువారీ సంత, వారసంతకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

మధ్యాహ్న భోజన బిల్లులను చెల్లించాలి

ఖలీల్‌వాడి, మార్చి 10 : నగరంలోని సీపీఐ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశాన్ని సీపీఐ జిల్లా నాయకురాలు బైరి సాయమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి సుధాకర్ హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన సుమారు రూ. 10 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు పోసాని, శకుంతల, నరేశ్, పద్మ, సుహాసిని, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘననివాళి

సత్యశోధక్ పాఠశాలలో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

టీయూలో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి/ సిరికొండ/ మోర్తాడ్, మార్చి 10 : సావిత్రీబాయి పూలే వర్ధంతిని జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

టీయూలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలే దేశంలోనే మొదటి ఉపాధ్యాయిని అని, అట్టడుగు వర్గాల వారికి చదువు నేర్పించిందని గుర్తుచేశారు.

సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. సత్యశోధక్ ఎడ్యుకేషనల్ చైర్మన్ నర్సయ్య.. సావిత్రీబాయి పూలే గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్ మండల కేంద్రంలో దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. దళిత సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లూరి రాజారాం, బాబూరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుడిమెట్ల మహదేవ్ మహరాజ్

కోటగిరి, మార్చి 10 : అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది కొలనుపాక మహాపాదయాత్ర చేపడుతున్నామని, నేడు (సోమవారం) పొతంగల్ మండలం సుంకిని నుంచి మహాపాదయాత్ర ప్రారంభం కానుందని గుడిమెట్ల మహదేవ్ మహరాజ్ తెలిపారు. పొతంగల్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుంకిని గ్రామంలో ఉదయం 9 గంటలకు మహాపాదయాత్ర ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 12 గంటలకు పొతంగల్ సాయిబాబా మందిరానికి చేరుకుంటామని చెప్పారు. విజయ్‌పటేల్ ఆధ్వర్యంలో అన్నదానం అనంతరం పాదయాత్ర కొనసాగి ఈ నెల 21న యాదాద్రి జిల్లా కొలనుపాక పుణ్యక్షేత్రం చేరుకుంటామని తెలిపారు. 22న జగద్గురు రేణుకాచార్యుల జయంతి ఉత్సవాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అధిక లోడ్‌తో రోడ్డుపై నిలిచిన లారీ

■ ట్రాఫిక్‌కు అంతారాయం

ఇందల్వాయి, మార్చి 10 : ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాక్లూర్ తండా 44వ నంబర్ జాతీయ రహదారి వద్ద అధిక లోడ్‌తో వెళ్తున్న లారీ.. రోడ్డుపై ఓవైపు ఒరిగి నిలిచిపోయింది. రోడ్డుపై సంచులు పడడం, రోడ్డుకు లారీ అడ్డుగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు పోలీస్‌స్టేషన్, టోల్‌ప్లాజాకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

వంజరి చారిటబుల్ ట్రస్ట్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గం

ఖలీల్‌వాడి, మార్చి 10 : వంజరి చారిటబుల్ ట్రస్ట్ జిల్లా నూతన కార్యవర్గాన్ని నాందేవ్‌వాడలోని సంఘ కార్యాలయంలో వంజరి సంఘం జిల్లాఅధ్యక్షుడు బోనేకర్ భూమయ్య, కోశాధికారి నవాతే నర్సన్న ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాస్టర్ శంకర్, ప్రధానకార్యదర్శిగా పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, కోశాధికారిగా కరిపె రవీందర్, ఉపాధ్యక్షులుగా భూపతిరావు, భూమేశ్, కార్యదర్శులుగా శ్రీనివాస్, గంగాధర్, కార్యానిర్వహణ కార్యదర్శులుగా గోపాల్ శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా విఘ్నేశ్, సతీశ్, మధుసూదన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ వేదిక సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి బాల శ్రీనివాస్

సుభాష్‌నగర్, మార్చి 10 : జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో ఉన్న గీతాభవనంలో బ్రాహ్మణ సంక్షేమ వేదిక సర్వసభ్య సమావేశం, మల్టీ పర్పస్ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి బాల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నివసిస్తున్న పేద బ్రాహ్మణులకు విద్య, వైద్య, స్వయం ఉపాధి తదితర అంశాల్లో రాయితీతో కూడిన సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సుమారు 400 మంది బ్రాహ్మణులకు గుర్తింపుకార్డులను అందజేశారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా ఆర్.యుగందర్, జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌ను నియమించినట్లు ప్రకటించారు. రాఘవేందర్‌శర్మ.. శిష్యబృందంతో వేద పఠన పారాయణం, కుమారి శ్రావ్య అన్నమయ్య సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫణీంద్ర, అజయ్ సంగ్వాయి, రాజ్‌కుమార్ సుబేదార్, ప్రశాంత్ జోషి, శ్రీధర వెంకట రాజరమణ శర్మ, కులకర్ణి రవితేజ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్‌లో మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ప్రముఖ మున్నూరుకాపు మహిళలను సన్మానించారు. జిల్లాకు చెందిన క్రీడాకారులతోపాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖ మహిళలను సైతం ఘనంగా సత్కరించారు.

– ఖలీల్‌వాడి, మార్చి 10

విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీచేయాలి

డిచ్‌పల్లి, మార్చి 10 : టీయూలోని సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సెమినార్ హాలులో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్‌ను రెండో రోజు ఆదివారం ముగిసింది. వర్తమాన రాజకీయాలు – ఉన్నత విద్య రంగంలో సవాళ్లు అంశంపై ప్రొఫెసర్ పున్నయ్య మట్లాడారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. సమావేశంలో 12 తీర్మానాలను ఆమోదించిందినట్లు తెలిపారు. 26 మందితో కన్వీనింగ్ కమిటీ ఎన్నుకున్నామని చెప్పారు. యూనివర్సిటీల కన్వీనర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ నాయకురాలు మమత, కో–కన్వీనర్లుగా ప్రసాద్, ఆంజనేయులు, పవిత్రను ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు సూరి, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి రమేశ్‌బాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు మెరుగైన భవిష్యత్తు

క్రీడాకారులతో మాట్లాడుతున్న ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై వంశీకృష్ణారెడ్డి

ధర్పల్లి, మార్చి 10 : యువత క్రీడలపై దృష్టి సారిస్తే మెరుగైన భవిష్యత్తు ఉంటుందని ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై వంశీకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గోవింద్‌పల్లి గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం సాయంత్రం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధర్పల్లి, సిరికొండ, భీమ్‌గల్, ఇందల్వాయి మండలాల యువతతో నెలరోజుల పాటు టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు బాగుంటుందని, పోలీసు శాఖ తరపున క్రీడా ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాలపై అర్వింద్‌ది కపటప్రేమ

కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

కంఠేశ్వర్, మార్చి 10 : బంజారాలపై ఎంపీ అర్వింద్‌కు ఉన్నది కపటప్రేమ అని, పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాంరావ్ మహరాజ్ విగ్రహాలను పంపిణీ చేశారని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్ కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి స్వార్థ రాజకీయాలకు తెరలేపుతున్నాడని ఆరోపించారు. బంజారాలపై ప్రేమ ఉంటే ప్రతి తండాలో రాంరావ్ మహరాజ్ గుడి కట్టించాలని డిమండ్ చేశారు. బంజారాల దీర్ఘకాల డిమాండ్ అయిన ఎస్టీలకు 10 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 12 శాతానికి పెంచేందుకు కృషిచేయాలని అన్నారు. బంజారాలు అర్వింద్‌ను నమ్మి మోసపోయేందుకు సిద్ధంగా లేరని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, తారాచంద్ నాయక్, ప్రకాశ్ నాయక్, రవినాయక్, సూర్యనాయక్, నరేందర్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కేంద్ర పోలీస్ దళ సిబ్బంది సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

జిల్లా నూతన కార్యవర్గం

వినాయక్‌నగర్, మార్చి 10 : తెలంగాణ రాష్ట్ర మాజీ కేంద్ర పోలీస్ దళ సిబ్బంది సంక్షేమ సంఘం – నిజామాబాద్ జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నగర శివారులోని అర్సపల్లిలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి మామిళ్ల రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోర్వ రమేశ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా గంగాప్రసాద్, కోశాధికారిగా తులసీ ప్రసాద్‌రెడ్డిని ఎన్నుకున్నారు. మాజీ కేంద్ర ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ సిబ్బంది సంక్షేమం కోసం కృషి కమిటీ కృషిచేస్తుందని మామిళ్లరాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడ్వైజర్ కమిటీ సభ్యులు బడుగు స్వామి, లక్ష్మీ నారాయణ, మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

కమ్మర్‌పల్లి, మార్చి 10: మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలని పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.సత్తెక్క అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని హాసాకొత్తూర్‌లో ఆదివారం పీవోడబ్ల్యూ మండల అధ్యక్షురాలు కె.శోభ అధ్యక్షతన నిర్వహించిన పీవోడబ్ల్యూ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు సారా సురేశ్, డివిజన్ నాయకులు సత్యనారాయణగౌడ్, మండల కార్యదర్శి అశోక్, పీవోడబ్ల్యూ నాయకురాలు లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

బడాభీమ్‌గల్‌లో చోరీ

భీమ్‌గల్, మార్చి 10: బడాభీమ్‌గల్‌లో శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు జంగం రాజేశ్వర్, జంగం ప్రవీణ్ ఇండ్లలో చోరీ జరిగింది. సుమారు 10తులాల బంగారం, రూ.30 వేల నగదు దుండగులు అపహరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా మాతృశ్రీ హైస్కూల్ వార్షికోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్, ఎంఈవో నాగనాథ్

బోధన్, మార్చి 10: పట్టణంలోని మాతృశ్రీ హైస్కూల్ వార్షికోత్సవాన్ని పట్టణ శివారులోని ఏఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎంఈవో నాగనాథ్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిరిగిరి దిగంబర్‌రావు, హైస్కూల్ యాజమాన్యం ప్రతినిధులు సిరిగిరి జయశ్రీ, సిరిగిరి సుభాష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఉత్సవాలు ప్రారంభం

రెంజల్,మార్చి 10: వీరన్నగుట్టలో రాతి బండలో వెలిసిన వీరభద్ర స్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రెంజల్ గ్రామంలో వీరభద్ర స్వామి ఆలయ అర్చకుడు నాగ్‌నాథ్‌అప్పా ఇంటి నుంచి కాలినడకన ఉత్సవ మూర్తులను భక్తులు వీరభద్ర స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. అగ్ని గుండం, రథోత్సవం, జాతర కార్యక్రమాలను వీక్షించేందుకు భక్తులు ఒక రోజు ముందుగానే చేరుకున్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

మాక్లూర్ , మార్చి 10: దాస్‌నగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 వలంటీర్లు ఆదివారం 6వ రోజు దుర్గానగర్ తండాలో శ్రమదానం చేశారు. వీధులు, డ్రైనేజీలు శుభ్రం చేశారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కల చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించి నీరు పోశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.సరిత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నో ఏండ్ల కల..సాకారమవనున్న వేళ

- చురుగ్గా 'ధర్మోరా ఎత్తిపోతల' పనులు
- మే నెలలోపు పూర్తికానున్న నిర్మాణం!
- రూ.11.70 కోట్ల నిధులు విడుదల చేసిన కేసీఆర్ సర్కారు
- వందల ఎకరాలకు అందనున్న సాగునీరు
- ఆనందంలో ముల్లంగి (బీ), బొంకన్‌పల్లి గ్రామాల రైతులు

లక్మాపూర్ వద్ద కొనసాగుతున్న ధర్మోరా పంప్‌హౌస్ ఎత్తిపోతల పనులు

పనులు పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు(ఫైల్)

మాక్లూర్, మార్చి 10: మండలంలోని బొంకన్‌పల్లి, ముల్లంగి (బీ) గ్రామాల రైతుల ఎన్నో ఏండ్ల కల త్వరలో నెరవేరనున్నది. అన్నదాతలు సాగునీరందక పడుతున్న ఇబ్బందులు.. ధర్మోరా ఎత్తిపోతల పథకంతో పూర్తిగా తొలగనున్నాయి. మండలంలోని ముల్లంగి (బి), బొంకన్‌పల్లి గ్రామాలు రైతులు సాగునీరందక పడుతున్న ఇబ్బందులను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. గుత్ప ఎత్తపోతల పథకం మొదటి ఫేజ్ ట్యాంకు ధర్మోరా సామెల చెరువును ఆధారం చేసుకొని లక్మాపూర్ వద్ద మినీ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.11.70 కోట్ల నిధులు మంజూరు చేయించారు. సుమారు నాలుగున్నర కిలోమీటర్ల పైప్‌లైన్‌తో పాటు, పంప్‌హౌస్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మూడు కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు బొంకన్‌పల్లి గ్రామం వరకు పూర్తికా వచ్చాయి. మరో కిలోమీటరున్నర పైప్‌లైన్ వేయాల్సి ఉంది. ధర్మోరా చెరువు నుంచి లిఫ్ట్ ద్వారా ఎత్తిపోసిన నీరు పైప్‌లైన్ ద్వారా ముల్లంగి(బీ) శివారులోని బోడగుట్ట పక్కన పెద్ద చెరువు సమీపంలోని కాలువలోకి చేరుతుంది. అక్కడి నుంచి కాలువల ద్వారా ముల్లంగి(బీ), బొంకన్‌పల్లి గ్రామాల్లోని సుమారు 1100 ఎకరాల భూములకు నీరు అందిస్తారు. గతంలో ఈ రెండు గ్రామాల రైతులు మాదాపూర్ పెద్ద చెరువు నీటితో పంటలు పండించేవారు. పూర్తిస్థాయిలో పంటలకు నీరందక ఇబ్బందులు పడేవారు. వెంకటాపూర్‌కు చెందిన దాదన్నగారి విఠల్‌రావు జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ముల్లంగి(బీ), బొంకన్‌పల్లి గ్రామాల సాగునీటి సమస్యను అప్పటి సీఎం కేసీఆర్‌కు వివరించి ఎత్తిపోతల పథకం మంజూరు చేయించారు. లిఫ్ట్ పనులు మే నెలలో పూర్తికానున్నాయి. వానకాలం పంటలకు ఢోకా లేదని ఎన్నోఏండ్ల కల సాకారం కాబోతున్నదని రెండు గ్రామాల రైతులు మురిసిపోతున్నారు.

మా కల సాకారమైంది..

ధర్మోరా మినీ ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో మా కల సాకారమైంది. మా గ్రామానికి 600 ఎకరాలు, ముల్లంగి(బీ) గ్రామానికి 500 ఎకరాల వరకు సాగునీరు అందుతుంది. ఇక నుంచి వానకాలం, యాసంగి పంటలకు ఢోకా ఉండదు. నిధులు మంజూరు చేసిన తొలి సీఎం కేసీఆర్‌కు, లిఫ్ట్ మంజూరు చేయించి పూర్తి చేయిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుకు రైతులు రుణపడి ఉంటారు.

- ప్రమోద్, రైతు, బొంకన్‌పల్లి

సాగునీటి కష్టాలు దూరం..

మాదాపూర్ చెరువు నుంచి వచ్చే నీళ్లు పంట చివరి దశలో అందేవికావు. మూడు గ్రామాల రైతు లకు ఒకే చెరువు నీళ్లు ఆధారం. లిఫ్ట్ నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది. సాగునీటి ఇబ్బందులుండవు. లిఫ్ట్ కోసం నిధులు మంజూరు చేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు, లిఫ్ట్ మంజూరు చేయించిన జడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు.

-బూరోల్ల ఆశన్న, రైతు, మాదాపూర్

పెగడపల్లి వీడీసీ ఎన్నిక

బోధన్ రూరల్, మార్చి 10: మండలంలోని పెగడపల్లి గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధనకంటి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా మంజ నాగరాజు, కోశాధికారిగా మద్ది అబ్బయ్య, ఉప కార్యదర్శిగా గాండ్ల గణేశ్‌తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

ఎడపల్లి, మార్చి 10: మండల కేంద్రంలో ఓ యువకుడు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై విక్రం ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన కంటెడి రాహుల్(25) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పులి చెరువులో రాహుల్ మృతదేహం కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి తల్లి శశిరేఖ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★అక్వా అక్షర పవన్ ఎంటర్‌ప్రైజెస్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. Age 18-45 Years, సాలరీ మార్కెటింగ్ స్కిల్స్ బట్టి 10K- 40K వరకు ఉంటుంది. Only 6 hours time ✆ 9121825513
NTZ-324729

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆర్మూర్‌టౌన్,మార్చి10: ఆలూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేశారు. రూ.10 లక్షలతో మహిళా భవనం, రూ.10లక్షలతో ఇందిరమ్మ కాలనీలో మురికి కాలువలు, రూ.5 లక్షలతో శివలింగయ్య ఆలయ ఆవరణలో షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, నాయకులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండా భూమిపూజ తగదు

ఆర్మూర్‌టౌన్, మార్చి10: ఆలూర్ మండల కేంద్రంలో అభివృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు భూమిపూజ నిర్వహించడం సరికాదని బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కొత్తురు గిరీశ్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో ఆర్మూర్ నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతోనే రూ.25 లక్షలు మంజూరు అయ్యాయని అన